ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తావిభాగం

ప్రాంతీయ వార్తలు

తేది : 29-07-2025 సమయం : 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి, గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఈ రోజు నల్లగొండ జిల్లాలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేసారు.
2. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి తెలిపారు.
3. రాజకీయాలకు అతీతంగా అర్హులందరకీ రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.
4. సుప్రసిద్ధ తెలుగు కవి, సాహితీవేత్త, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత ఆచార్య సి.నారాయణరెడ్డి - 94వ జయంతి సందర్భంగా రాష్ట్రంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

నాగార్జున సాగర్ - మంత్రులు

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, నల్లగొండ జిల్లాలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు ఈ ఉదయం విడుదల చేసారు. డ్యాం గేట్లు తెరిచిన అనంతరం మంత్రులు కృష్ణా జలాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. దాదాపు 18 ఏళ్ల తరువాత జులై లోనే సాగర్ నిండటంతో నీటిని విడుదల చేయడం సంతోషంగా ఉందని తెలిపారు.. ప్రాజెక్టులో నీటి నిల్వలు సమృద్ధిగా ఉండటంతో పాటు ఎగువ నుంచి వరద నీరు వస్తున్నందున తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో రెండు పంటలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నీటిని వినియోగించుకోవచ్చని తెలిపారు.

సౌండ్ బైట్: మంత్రి ఉత్తమ్ కుమార్

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని, ప్రాజెక్టుల గేట్ల ద్వారా నీటిని విడుదల చేయడం దీనికి నిదర్శనమన్నారు.

సౌండ్ బైట్ : మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

పిటిసి నల్గొండ

వరదనీరు

గత వారం రోజులుగా విస్తారంగా కురిసిన వర్షాలతో నిజామాబాద్ శ్రీ రామ్ సాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా ప్రస్తుతం 1075.60 అడుగులకు చేరింది. కాకతీయ కాల్వ ద్వారా 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు.

మంచిర్యాల జిల్లా, డెస్క్

సన్న బియ్యం – మంత్రి వివేక్

పేద ప్రజల కోసమే రాష్ట్రంలో సన్నబియ్యం పథకం ప్రవేశ పెట్టామని కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వెంకటస్వామి అన్నారు. ఈరోజు సిద్దిపేట జిల్లా కేంద్రంలో సిద్దిపేట

నియోజకవర్గానికి సంబంధించిన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్లాలనే ఉద్దేశంతో వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

పీటీసీ సిద్దిపేట

మంత్రి పొన్నం ప్రభాకర్

రాజకీయాలకు అతీతంగా అర్హులందరకీ రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ రోజు హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. హైదరాబాద్ నగరంలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నూతన్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. నగరంలో దాదాపు 50 వేల రేషన్ కార్డుల ధృవీకరణ పూర్తయిందని.. వాటిని త్వరలోనే పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వల్ల లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని పేర్కొన్నారు.

పీఎన్

పులుల దినోత్సవం

ఈ రోజు అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని జరుపుకొంటున్నారు. పెద్దపులుల సంఖ్య తగ్గుతున్న నేపథ్యంలో వాటి సంరక్షణ నిమిత్తం 2010 నుంచి జులై 29న అంతర్జాతీయ పులుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. తెలంగాణ మంచిర్యాల జిల్లా లో కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రాన్ని 2012 లో కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం పై మా ఆకాశవాణి ప్రతినిధి లక్కాకుల శ్రీనివాస్ అందిస్తున్న కథనం....

వాయిస్ కాస్ట్: లక్కాకుల శ్రీనివాస్

ఆసిఫాబాద్ జిల్లాలో అటవీశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పులుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా 11 రేంజ్ కార్యాలయాల పరిధిలో అవగాహన బైక్ ర్యాలీలు చేపట్టారు.

ఆసిఫాబాద్, మంచిర్యాల

**BREAK**

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు వింటున్నారు. మరిన్ని Updates కోసం హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం "ఎక్స్" handle @ airnews_hyd ని ఫాలో అవండి. AIR News Hyderabad YouTube Channel కి సబ్ స్క్రైబ్ చేయండి.

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ రాత్రి నిద్ర

బాలికలు విద్యలో రాణించి మెరుగైన భవిష్యత్తు సాధించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య కోరారు. నిన్న సంగారెడ్డి జిల్లాలోని హత్నూరు కస్తూర్బా విద్యాలయంలో కలెక్టర్ రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఐఐటీ, నీట్ ఎంసెట్ లాంటి పరీక్షలకు సిద్ధపడేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. కేజీబీవీ విద్యార్థులకు ఎంఎస్ ఆఫీస్ మెలకువలను నేర్పించాలని సూచించారు.

SANGAREDDY. PTC

సినారె జయంతి

సుప్రసిద్ధ తెలుగు కవి, సాహితీవేత్త, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత ఆచార్య సి. నారాయణరెడ్డి - సినారె 94 వ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నివాళులు అర్పిస్తున్నారు. గేయ రచయితగా, నవలాకారుడిగా, పద్యకవిగా సాహిత్యరంగంలో సినారె విశిష్ట సేవలు అందించారు.

తెలుగు విశ్వవిద్యాలయం వైస్ చాన్సెలర్‌గా, రాజ్యసభ సభ్యుడిగా కూడా పనిచేశారు. సినారె స్వగ్రామమైన రాజన్న సిరిసిల్లా జిల్లా వేములవాడ రూరల్ మండలం హన్మాజీ పేటలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆచార్య సి. నారాయణ రెడ్డి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ సాహిత్యానికి వన్నెతెచ్చిన మహాకవి, తెలుగుభాషా వైభవాన్ని చాటిన సారస్వత శిఖరమని ముఖ్యమంత్రి కొనియాడారు. విశ్వంభర పద్యకావ్య రచనతో తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తన రచనలతో తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన సాహితీ సౌరభం సినారె అని తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల కవిత అన్నారు.

డెస్క్

ఏటీసీ సెంటర్లు - కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలోని ఐటీఐ – అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లలో 2025–26 విద్యా సంవత్సరానికి ఈ నెల 31తో రెండో దశ అడ్మిషన్ల గడువు ముగుస్తుందని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశాలను ప్రోత్సహించేందుకు రూపొందించిన పోస్టర్లు, పాంప్లెట్లను ఆవిష్కరించారు.

కామారెడ్డి

ఖోఖో జాతీయకోచ్

క్రీడలు ఆడటం ద్వారా విద్యార్థులకు భవిష్యత్లో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని జాతీయ మహిళా ఖో ఖో కోచ్ ఇస్లావత్ నరేష్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి పిఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో 33 వ రీజినల్ స్థాయి ఖోఖో పోటీలను నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కోచ్ నరేష్ మాట్లాడుతూ... గతంలో ఖోఖో ఆటకు కేవలం

రైల్వేల్లో మాత్రమే ఉద్యోగం అవకాశలు ఉండేవని, ఇప్పుడు వివిధ సంస్థల్లో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

(బైట్: కోచ్ నరేష్)

దక్షిణ భారత్‌లో 8 క్లస్టర్లకు చెందిన 850 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు.

కరీంనగర్

సింగరేణి సీఎండీ

సింగరేణి ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ అరుదైన ప్రపంచ రికార్డు సాధించారు. స్వయంగా 20 వేల మొక్కలు నాటి విశ్వగురు వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. దేశంలో 20 వేల మొక్కలను నాటిన మొదటి సివిల్ సర్వీసెస్ అధికారిగా గుర్తింపు సాధించారు. సీఎండీ ఎన్.బలరామ్ కు విశ్వగురు వరల్డ్ రికార్డు పత్రాన్ని, జ్ఞాపికను సంస్థ ప్రతినిధులు అందించారు.

పీఎన్

వాతావరణం

రాష్ట్రంలో వచ్చే నాలుగు రోజుల పాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. అన్ని జిల్లాల్లోనూ 30 నుంచి 40 కి.మీ. వేగంతో బలమైన ఉపరితల గాలులు వీస్తాయని తెలిపింది.

పీఎన్

**CLOSING**

ఆకాశవాణి వార్తలు ఇంతటితో సమాప్తం. తిరిగి సాయంత్రం 6 గంటల 10 నిమిషాలకు ప్రాంతీయ వార్తలు వింటారు.